


నందివనపర్తిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న సిబ్బంది

### నందివనపర్తిలో...,

## మొక్కలు నాటిన అధికారులు

యాచారం, ఆగస్టు 12 : 'ఇదేనా స్వచ్ఛదనం-పచ్చదనం' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. నందివనపర్తి గ్రామంలో గుంతలు తీసి మొక్కలు నాటకుండా వదిలేసిన విషయం తెలిసిందే. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి ఎక్కడైతే గుంతలు తీసి మొక్కలు నాటకుండా వదిలేశారో.. అక్కడ తిరిగి సిబ్బందితో మొక్కలు నాటించారు. నాటిన మొక్కలకు నీరు పోయించారు. గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు, వనమహోత్సవం కార్యక్రమంలో నాటాల్సిన మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

టీచర్ మీటింగ్‌కు వెళ్తే బడి బంద్
విద్యార్థులకు సక్రమంగా అందని విద్య
సమయపాలన పాటించని ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు

# సారు రాడు.. చదువు సాగదు..!




నక్కలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

## సింగిల్ టీచర్ పాఠశాలల్లో ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు

మొయినాబాద్, ఆగస్టు 13 : ఏకోపాధ్యాయుడు ఉన్న సర్కారు బడుల్లో చదువులు అటకెక్కుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. సారు సమావేశానికి వెళితే బడికి సెలవే. విద్యాశాఖ పరంగా నిర్వహించే సమావేశాలకు ఉపాధ్యాయుడు వెళ్లినప్పుడు సీఆర్‌పీలు పాఠశాలను నిర్వహించాల్సి ఉంటుంది. సీఆర్‌పీలు ఆలస్యంగా వస్తుండడంతో స్కూల్‌లో చెప్పేవారు.. చూసేవారు ఎవ్వరూ లేరని విద్యార్థులు పాఠశాలకు డుమ్మా కొడుతున్నారు. ఈ పరిస్థితి సోమవారం మొయినాబాద్ మండల పరిధిలోని ఎత్తుబార్‌పల్లి గ్రామంలో కనిపించింది. పెద్దమారుపల్లి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, అందులో ఒక ఉపాధ్యాయుడికి పదోన్నతి వచ్చి వెళ్లిపోయాడు. దీంతో ప్రస్తుతం సింగిల్ టీచర్‌తోనే పాఠశాల కొనసాగుతున్నది. సోమవారం సింగిల్ టీచర్‌కు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉండడంతో పాఠశాలకు రాలేకపోయింది. టీచరు సమావేశానికి వెళ్లిన సంగతి విద్యార్థులకు తెలుసో.. లేదో.. కానీ ఒక్క విద్యార్థి కూడా బడికి రాలేదు. అవెంజర్‌గా పని చేస్తున్న ఒక వృద్ధురాలు మాత్రమే పాఠశాల గేటు తెరిచి ఉంచారు. సీఆర్‌పీ కూడా ఆలస్యంగా వస్తుండడంతో ఒక్క విద్యార్థి కూడా స్కూల్‌కు రావడం లేదు. గ్రామంలో మల్లికార్జునస్వామి బోనాల ఉత్సవాలు ఉండడం వల్ల రాలేకపోయి ఉండవచ్చని అక్కడ పని చేసే స్కావెంజర్ తెలిపారు. కానీ విద్యాశాఖ మండల అధికారులకు ఉన్న సమాచారం ప్రకారం గ్రామంలో బోనాలు ఉండడంతో మంగళవారం మాత్రమే లోకల్ సెలవు కోసం దరఖాస్తు పెట్టారని విద్యాశాఖ అధికారులు చెప్పారు.



ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో అంతంతమాత్రంగా వచ్చిన విద్యార్థులు

**సింగిల్ టీచర్ పాఠశాలలు..**

మొయినాబాద్ మండలం నగరానికి అతి సమీపంలో ఉండడంతో మండలంలో సుమారుగా 8 పాఠశాలలు సింగిల్ టీచర్లతో నిర్వహిస్తున్నారు. సజ్జన్‌పల్లి, వీరన్నపేట్, అమీర్‌గూడ, చాకలి గూడ, నజీబ్‌నగర్, దేవలవెంకటాపూర్, చిన్నషాపూర్, కాశీంభౌలి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సింగిల్ టీచర్లు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ పరంగా సమావేశాలకు వెళ్లినప్పుడు, సెలవు పెట్టినప్పుడు విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడుతున్నది. టీచర్ ఉన్నచోట ఉపాధ్యాయులు అందుబాటులో లేనప్పుడు సీఆర్‌పీలతో పాఠశాలను నిర్వహించినప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది.

**సమయపాలన పాటించాలని ఆదేశిస్తాం..**

తొమ్మిది గంటల్లోపు ఉపాధ్యాయులు పాఠశాలలకు రావాలని ఆదేశించాం. ఆలస్యంగా వస్తే శాఖ పరంగా వారికి తగిన సూచనలు చేస్తాం. అయినా తీరు మారకపోతే చర్యలు తీసుకుంటాం. సింగిల్ టీచర్ ఉన్నచోట విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగడం వాస్తవం. కానీ ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సింగిల్ టీచర్‌తో పాఠశాలలు నడిపించాల్సి ఉంటుంది.

– కే వెంకటయ్య, మండల విద్యాధికారి

### ఫార్మా విలేజ్ అంశాన్ని

## పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా

రైతులకు ఎంపీ డీకే అరుణ హామీ



ఎంపీ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బొంరాస్‌పేట, ఆగస్టు 12 : దుద్యాల మండలంలోని లగచెర్ల, పోలేపల్లి, హకీంపేట గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్ విషయమై జరుగుతున్న బలవంతపు భూసేకరణపై రైతుల పక్షాన పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ రైతులకు హామీ ఇచ్చారు. మూడు గ్రామాలకు చెందిన రైతులు సోమవారం మహబూబ్‌నగర్‌లో ఎంపీని కలిసి ఫార్మా వద్దంటూ వినతిపత్రం అందజేశారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు వల్ల కలిగే అనర్థాలు, భూములు కోల్పోవడం వల్ల పడే అవస్థలను రైతులు ఎంపీకి వివరించారు. ఈ ప్రాంతాలో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారని, ఫార్మా కంపెనీల కోసం పేద రైతుల భూములను తీసుకుంటే అన్యాయం జరుగుతున్నదని ఎంపీ అన్నారు. ఇదే అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతానని, రైతులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### వరకట్న హత్య కేసులో

## ముగ్గురికి జీవిత ఖైదు, రూ.50 వేలు జరిమానా

కడ్తాల్ (తలకొండపల్లి), ఆగస్టు 12 : వివాహితను వరకట్నం కోసం వేధింపులకు గురి చేసి, ఆమె మరణానికి కారణమైన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి కోర్టు జీవితకాలం శిక్ష విధించింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం పూల్‌సింగ్ తండాకు చెందిన పాత్లావత్ సురేందర్‌కి సునీతతో వివాహం జరిగింది. వివాహ సమయంలో వరుడికి రూ.ఐదు లక్షలు నగదు, రెండు తులాల బంగారం వరకట్నం రూపంలో ఇచ్చారు. వారికి కుమారుడు, కుమార్తె పుట్టే వరకు వారి కాపురం రెండేండ్లపాటు సజావుగా సాగింది. అదనపు కట్నం తీసుకురావాలని సునీతను భర్త సురేందర్, అతడి తల్లి పీక్లీ, ఆడపడుచు సంతోశ మానసికంగా, శారీరకంగా వేధింపులు గురి చేసేవారు. వేధింపులు భరించలేక సునీత 2021 జనవరి 10వ తేదీన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్ తరలించారు. దర్యాప్తు అనంతరం ఐవో అయిన ఏసీపీ కుశాల్కర్ ఎల్బీనగర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం సాక్ష్యాధారాలను పరిశీలించిన ఎల్బీనగర్ తొమ్మిదో తరగతి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు. సునీత మృతికి కారణమైన సురేందర్, పీక్లీ, సంతోశకి కోర్టు జీవితకాలపు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ వివరించారు.

## మహిళా సాధికారతపై అవగాహన కలిగి ఉండాలి

వికారాబాద్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ బలరాం

ధారూరు, ఆగస్టు 12 : మహిళా సాధికారత ఆవశ్యకతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ బలరాం తెలిపారు. సోమవారం ధారూరు మండల కేంద్రంలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు మహిళా సాధికారత, బేటి బచావో-బేటి పడావో ముఖ్య ఉద్దేశం మని, ఆవశ్యకత విధులను తెలిపారు. సమాజంలో స్త్రీ ముఖ్య పాత్ర, 2006 బాల్య వివాహ నిషేద చట్టం, ఫోక్సో చట్టంపై, పని చేసే ప్రదేశాల్లో ఆడవాళ్లపై జరిగే లైంగిక హింస, ఫోక్సో యాక్ట్ లింగ వివక్షత లింగ సమానత్వం, గృహ హింస వరకట్న నిషేదం, సఖీ కేంద్రం ఐదు రకాల సర్వీసులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఆయన వివరించారు. వడదెబ్బ తాకకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్ 100, 1098, 181, 14567, ఏ విధంగా ఉపయోగపడుతాయో గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రామ్‌దాస్, బాబు పాల్గొన్నారు.




ధారూరులో విద్యార్థులకు జెండర్‌పై అవగాహన కల్పిస్తున్న వికారాబాద్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యులు రామదాస్, బాబు

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కే గాంగ్యనాయక్,

కులకచర్ల, ఆగస్టు 12: కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కే గాంగ్యనాయక్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాలో కేజీబీవీ ఉద్యోగులు, సమగ్రశిక్షా ఉద్యోగులు అంజుమ్, నాగమణి, పండరయ్య, మాణేమ్మ, సోనిబాయి, రాంచంద్రయ్య, వెంకట్రాములు విధి నిర్వహణలో మృతి చెందారని వారిని స్మరిస్తూ మండల విద్యావనరుల కేంద్రం, కేజీబీవీ పాఠశాలలో సమగ్రశిక్షా ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మౌనం పాటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఏను విద్యాశాఖలో విలీనం చేసి కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్డ్ చేయాలన్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున తక్కువ వేతనాలతో పాటు పని ఒత్తిడి పెరిగిందని, బేసిక్ పే అమలు చేయాలని తెలిపారు. ఆరోగ్య బీమా రూ.ఐదు లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలో గానీ సమగ్రశిక్షలో గానీ ఉద్యోగం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారం కానిచో దశలవారీగా నిరసనలు తెలియజేసి సమ్మెకు పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సంతోశ్‌రెడ్డి, మెస్సెంజర్ రాములు, సీఆర్పీలు మహిపాల్, కృష్ణయ్య, రాఘవేందర్, విజయ్‌కుమార్, రమేశ, రాజు, పీటీలు అమృత, సంతోషి ,లక్ష్మయ్య, కేజీబీవీ ఉద్యోగులు బాగ్యమ్మ, కల్పన, సుశీల, రాజశ్రీ, సుమలత, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కులకచర్ల కేజీబీవీ పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడ్తాల్, ఆగస్టు 12: ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన ఆవరణలో, ఎస్‌టీఎఫ్ఐ జెండాను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ చేసిన పోరాటాలతోనే ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను కల్పించిందని తెలిపారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసులు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలు డీఏలను సాధిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందించాలని తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ సంఘం దేశ వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షురాలు కౌసల్య, కోశాధికారి విజయ్‌కుమార్, సభ్యులు భాగ్యలక్ష్మీ, రవీందర్‌రెడ్డి, బుచ్చమ్మ, నర్సింగరావుమూర్తి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనతో క్రమశిక్షణ

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అర్చకులు రంగరాజన్

మొయినాబాద్, ఆగస్టు 13 : ఆధ్యాత్మిక భావనతో మనిషిలో క్రమశిక్షణ పెరుగుతుందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. చిలుకూరు గ్రామ రెవెన్యూలోని సురకంటి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం చుట్టూ సీసీ రోడ్డు వేసేందుకు జగిత్యాల కృష్ణయ్య స్వచ్ఛందంగా ముందుకు రావడంతో సోమవారం సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. సీసీ రోడ్డు వేయిస్తున్న దాతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చిలుకూరు గౌడ సంఘం అధ్యక్షుడు సుభాశ్‌గౌడ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు దర్గా నరేందర్, భక్తుడు పవన్ కుమార్, రమేశ్‌గౌడ్, జీనుకుంట జనార్దన్, మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు రాంపల్లి సంతోశ్‌కుమార్‌చారి, బీజేపీ గ్రామ అధ్యక్షుడు యాదగిరి, బండారి విక్రమ్ రెడ్డి, సంజిత్ రెడ్డి, నరేశ్, అభిలాష్‌గౌడ్, విగ్నేశ్‌రాజేందర్ పాల్గొన్నారు



ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

రంగారెడ్డి, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 160 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారి ఫిర్యాదులను కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డిలతో కలిసి స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

**వికారాబాద్ జిల్లాలో..**

వికారాబాద్ : ప్రజల నుంచి వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణికి 150 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి, భూ సర్వే, ఆసరా పింఛన్‌లకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

## రేడియాలజీలో ఏఐ పరిజ్ఞానం

అభివృద్ధి చేసిన ట్రిపుల్ ఐటీ పరిశోధక బృందం

సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించేందుకు పరిశోధనలు జరుగుతున్నాయి. రోగ నిర్ధారణ, చికిత్స అందించడంలో కీలకమైన రేడియాలజీ విభాగంలో కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ని వినియోగించి మెరుగైన వైద్య సేవలందించే పరిశోధనను గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ పరిశోధక బృందం అభివృద్ధి చేసింది. ప్రొఫెసర్ జయంతి శివస్వామి నేతృత్వంలో మెడికల్ ఇమేజింగ్‌లో 'ఏఐ' అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఇప్పటి వరకు రేడియాలజీలో ఎక్స్‌రేలు, స్కానింగ్‌ల ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేపడుతుండగా, అందులో ఏఐ సహాయక రేడియాలజీ ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని ఈ పరిశోధనలో గుర్తించారు. చాలా కాలంగా ఆరోగ్య సంరక్షణలో, రోగ నిర్ధారణలో చిత్రాలు(ఇమేజింగ్) చాలా కీలకంగా ఉంటున్నాయి. ఛాతి వ్యాధులు, రొమ్ము క్యాన్సర్ వంటి వాటిని పరీక్షించేందుకు ఎక్స్‌రే, అల్ట్రాసోనోగ్రఫీ, ఎంఆర్ఐ, సిటీ స్కాన్ వంటివి చేసి వ్యాధుల తీవ్రతను ఆయా చిత్రాల ద్వారా గుర్తిస్తున్నారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఇమేజింగ్ సౌలభ్యంతో ఏఐ ద్వారా చాలా సులభంగా కంప్యూటర్‌లో ప్రాసెసింగ్ చేసి నిర్ధారణ చేసే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయంతి శివస్వామి పరిశోధక బృందం గుర్తించింది.